ప్రజలకు రుణపడి ఉంటా..

బీఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్, జూన్ 15 : రెండు పర్యాయాలు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, చేపట్టిన సంక్షేమాన్ని చూసి నిండుమనసుతో ఆశీర్వదించి భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయాన్ని అందించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం 132 – జీడిమెట్ల డివిజన్ ఎం.ఎన్.రెడ్డి నగర్ కాశీ విశ్వేశ్వర ఆలయ కమ్యూనిటీ హాల్‌లో హ్యాట్రిక్ విజయంతో ఎమ్మెల్యేగా గెలిచిన కె.పి.వివేకానంద్‌ను సన్మాన సభ ఏర్పాటు చేసి కార్యక్రమ నిర్వాహకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు తనను ఒక కుటుంబ సభ్యుడిలా ఆశీర్వదించి మూడోసారి రాష్ట్రంలోనే అఖండ మెజార్టీతో గెలిపించుకున్న ఘనత ఇక్కడి ప్రజల కృషి అని గుర్తు చేసుకున్నారు. ప్రజల రుణం తీర్చుకోవడానికి ఏ సమయంలోనైనా అండగా నిలిచేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. కాలనీలో కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం పునః నిర్మాణ పనులకు ముందుకు వచ్చి తమ తోడ్పాటునందిస్తున్న దాతలను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఎం.ఎన్. రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, టెంపుల్ కమిటీ చైర్మన్ ఎస్. గోవర్ధన్ రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి భరత్, దేవాలయ ప్రధాన కార్యదర్శి శివరాం రెడ్డి, కోశాధికారి రాము, కాలనీవాసులు లక్ష్మీ మోహన్, మోహన్ రావు, సంజీవరావు, చంద్రారెడ్డి, హరికృష్ణ, కిరణ్ కుమార్, బాల శ్రీనివాసమూర్తి, చంద్రశేఖర్, నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, గుమ్మడి మధుసూదన్ రాజు, కాలే నాగేశ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సమ్మయ్య నేత, సూదుల సంపత్ గౌడ్, బాల మల్లేశ్, ఆటో బలరాం, విజయ్ హరీశ్, మహిళా నాయకురాలు ఇంద్రా రెడ్డి, శ్రీదేవి రెడ్డి, కల్పన పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివేకానంద్‌ను గజమాలతో సన్మానిస్తున్న కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు, పార్టీ శ్రేణులు

నీటి సరఫరాకు అంతరాయం

మాదాపూర్ : శేరిలింగంపల్లిలోని పలు ప్రాంతాల్లో పైపులైన్లకు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు జలమండలి అధికారులు తెలిపారు. కృష్ణా ఫేజ్ – 3 రింగ్ మెయిన్ –1 పరిధిలోని ప్రశాసన్ నగర్ నుంచి అయ్యప్ప సొసైటీ వరకు 1200 ఎంఎం డయా పీఎస్సీ గ్రావిటీ మెయిన్ పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడింది. దీనిని అరికట్టేందుకు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటల నుంచి మరుసటి రోజు మ ధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఏర్పడనున్నదని అధికారులు పేర్కొన్నారు. 24 గంటల వరకు కింద పేర్కొన్న రిజర్వాయర్ ప్రాంతాల్లో తాగు అంతరాయం ఏర్పడనున్నది.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలు

ఓ అండ్ ఎం డివిజన్ నం.15 : మాదాపూర్ సెక్షన్ పరిధిలోని చంద్రా నాయక్ తండా, అయ్యప్ప సొసైటీ, సాయి నగర్ కాలనీ లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని నీటిని పొదుపుగా వాడుకోగలరని జలమండలి అధికారులు తెలిపారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో అదివారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు). టమాట 23, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 45, బజ్జి మిర్చి 23, కాకర 38, బీర 40, క్యాబేజీ 15, ఫ్రెంచ్ బీన్స్ 55, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 23, దొండ 18, చిక్కుడు 45, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 31, క్యాప్సికం 55, ఆలు 24, కీర 18, దోస 18, సోర 12, పొట్లకాయ 23, కందగడ్డ 45, ఉల్లిపొరక 45, ఉల్లిగడ్డ 24, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ 9 నుంచి 11, చామగడ్డ 33, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 24 నుంచి 30, మునగకాయ(1) 5 నుంచి 6, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9:30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన బీఆర్ఎస్ నాయకులు, కాలనీ వాసులు

దుండిగల్, జూన్ 15 : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, శంభీపూర్ లోని ఆయన కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, వివిధ కాలనీల సభ్యులు, యాదవ సంఘ సభ్యులు ఆదివారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పరిష్కరించాలని విన్నవించారు. ఎమ్మెల్సీ రాజు సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. పలు ప్రాంతాల్లో జరగబోయే వేడుకల్లో పాల్గొనాలని పలువురు ఎమ్మెల్సీకి ఆహ్వానపత్రికలను అందజేశారు.

ధర్నాను జయప్రదం చెయ్యండి

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

దుండిగల్ : ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా 17న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చెయ్యాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. షాపూర్‌నగర్ లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం వామపక్ష పార్టీల నాయకులు గోడపత్రికను ఆవిష్కరించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు యూసఫ్, జిల్లా కార్యదర్శి ఉమామహేశ్, సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణ్, సీపీఐ ఎంఎల్ నాయకులు అనురాధ, శివబాబు, మాస్‌లైన్ కార్యదర్శి ప్రవీణ్, సీపీఎం నాయకులు అంజయ్య, సత్యం, స్వాతి పాల్గొన్నారు. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును కాలరాస్తున్నారని, చర్చలు జరుపడానికి సిద్ధమని ప్రకటించిన ప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఖనిజాలు, అడవులను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసేందుకే ఆపరేషన్ కాగార్ అన్నారు. దాన్ని ఆపేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి ధర్నాను జయప్రదం చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నర్సింహారెడ్డి, వంశీ, జంబూ, లక్ష్మి, సీపీఎం నాయకులు శ్రీను, కరుణాకర్, ఎండీ బాషా పాల్గొన్నారు.

బ్రాండ్ బిల్డింగే విజయసూత్రం

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు గుమ్మి రామ్ రెడ్డి

మాదాపూర్ : విజయం సాధించాలంటే ఏదైతే చెప్పామో అదే చేయాలని క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు గుమ్మి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీలో రెడ్డి బిజినెస్ హబ్ కాంక్లేవ్ అట్టహాసంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఆర్గ గ్రూప్ సీఎండీ, క్రెడాయి నేషనల్ ప్రెసిడెంట్ గుమ్మి రాంరెడ్డి విచ్చేశారు. నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డబ్బు కోసం వ్యాపారం కాదు వ్యాపారం చేస్తూ డబ్బు సంపాదించాలని చెప్పారు. వ్యాపారంలో బ్రాండ్ బిల్డింగ్ అనేది ముఖ్యమని, షార్ట్‌టర్మ్ కొరకు కాకుండా లాంగ్ టర్మ్ ఉండే సక్సెస్ చూసుకోవాలని చెప్పారు. మెట్రో ఎండీ ఎంబీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సమ్మిట్ లక్ష్యం రెడ్డి సామాజిక వర్గం వ్యాపార మని, అమెరికాలో 50% బిలియన్లు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు ఉండగా, భారతదేశంలో టాప్ వ్యాపారాలలో 80 శాతం మేర మార్వాడీలు, గుజరాతీలున్నట్లు తెలిపారు. తరతరాల జ్ఞానాన్ని పంచుకుంటూ, వ్యాపారం, విజ్ఞానం, సాంకేతికత వంటి రంగాల్లో గొప్ప విజయాలను సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి బిజినెస్ హబ్ నిర్వాహకులు భరత్ రెడ్డి, రెడ్డి బిజినెస్ హాఫ్ ఫౌండర్స్ కె. వెంకటరెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, డా. స్వాతిరెడ్డి పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు మందలపు సాయిబాబా చౌదరి జన్మదినం సందర్భంగా ఆయనను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీమంత్రి పువ్వాడ అజయ్, కూకట్‌పల్లి బీఆర్ఎస్ కో – ఆర్డినేటర్ సతీశ్ అరోరా, మాజీ కార్పొరేటర్లు బాబురావు, శ్రావణ్ కుమార్, గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.
– కేపీహెచ్‌బీ కాలనీ

క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ నిత్యం క్రీడలకు సమయానికి కేటాయించాలని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం వెల్ఫేర్ అసోసియేషన్లు, యువజన సంఘాల సభ్యులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు.
- కేపీహెచ్‌బీ కాలనీ

వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

కేపీహెచ్‌బీ కాలనీ : కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 32వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం కల్యాణమస్తు శుభ వివాహ ప్రాప్తి సర్వదోష నివారణ యాగంలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

వయోవృద్ధులు పరీక్షలు చేయించుకోవాలి

అల్లాపూర్ : వయోవృద్ధులు వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకొని వారి సూచనలు మేరకు ఆరోగ్య సూత్రాలు పాటించాలని మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ ఎస్.వి.ప్రసాద్ అన్నారు. ఆదివారం కమిటీహాల్‌లో సాయిప్రసాద్ సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం మోతీనగర్ కమ్యూనిటీ హాల్లో వయోవృద్ధులకు శిబిరం నిర్వహిస్తున్నామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేపీహెచ్‌బీ కాలనీలోని లులు మాల్‌లో మూడు రోజులుగా కొనసాగుతున్న కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. యూఐసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కిక్ బాక్సింగ్ వెల్డర్ వెయిట్ విభాగంలో వాయిడ్ విజయం సాధించి చాంపియన్ గా నిలిచాడు. ఆదివారం విజేతలకు లులు గ్రూప్ రీజనల్ డైరెక్టర్ అబ్దుల్ ఖదీర్ షేక్, మేనేజర్ మహమ్మద్ షరీఫ్, మాల్ మేనేజర్ ఎడిల్ అరసన్ బహుమతులను అందజేశారు.
- కేపీహెచ్‌బీ కాలనీ

రక్తదానం చేయడానికి ముందుకు రావాలి

శేరిలింగంపల్లి, జూన్ 15: గచ్చిబౌలిలోని కాంటినెంటల్ హాస్పిటల్స్ 2025 రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్ – హౌస్ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ నిర్వహించింది. మూడు రోజులుగా 100 మంది రక్తదానం చేశారు. ఆదివారం కాంటినెంటల్ హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ గురు ఎన్. రెడ్డి మాట్లాడుతూ.. యూనిట్ రక్తం మూడు ప్రాణాలను కాపాడుతుందని, అత్యవసర పరిస్థితుల్లో విలువైన ప్రాణాలను కాపాడటానికి రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. శిబిరంలో ప్రముఖ రక్తదాతలలో కలిసి TGIIC జోనల్ మేనేజర్ కవిత ముత్యాల ఆసుపత్రిలో రక్తదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

బాలికపై మైనర్ లైంగికదాడి

జగద్గిరిగుట్ట, జూన్ 15 : బాలికపై మైనర్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలోని బస్తీలో రెండు కుటుంబాల వారు సమీపంలో నివాసముంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం బాలిక (5) పై అదేప్రాంతానికి చెందిన బాలుడు (14) లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక బాధతో ఏడుస్తూ ఉండడంతో ఆరాతీయగా విషయం తెలిసింది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు ఘటనను ధ్రువీకరించినా.. వివరాలు గోప్యంగా ఉంచి విచారిస్తున్నారు.

చిత్తుబొత్తు స్థావరంపై పోలీసుల దాడి

పట్టుబడిన నిందితులు

కుత్బుల్లాపూర్ : చిత్తుబొత్తు ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ పరిధిలో ఆదివారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్లితే.. దేవరాంజల్‌లో సాయి గీత ఆశ్రమం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో చిత్తు బొత్తు ఆడుతున్న స్థావరంపై విశ్వసనీయ సమాచారం మేరకు మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. 12 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.లక్ష 73 వేల నగదు, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దీని వివరాలను పోలీసులు బహిర్గతం చేయకపోవడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.

నేడు ఆలయ వార్షికోత్సవం

మియాపూర్ , జూన్ 15: ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో సాయిబాబా ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించినట్లు ఆలయ కమిటీ ప్రతినిధి జగదీశ్ ఆదివారం తెలిపారు. ఉదయం నుంచి పూజలు, అన్నసంతర్పణ నిర్వహించనున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విద్యతోనే మెరుగైన జీవితం

డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ వ్యవస్థాపకురాలు అరుణతో కలిసి అవగాహన కల్పిస్తున్న హెచ్‌సీయూ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు

మాదాపూర్, జూన్ 15 : విద్యతోనే మెరుగైన జీవితం సాధ్యమవుతుందని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధనకు కృషి చేయాలని హెచ్‌సీయూ ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. మియాపూర్ గోకుల్‌ప్లాట్‌లోని డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు విచ్చేసి సొసైటీ వ్యవస్థాపకరాలు చావా అరుణతో కలిసి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రభుత్వం వసతులు, సౌకర్యాలు కల్పిస్తుందని, మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పుస్తకాలు అందిస్తుందని తెలిపారు. పేదలు, వలస కార్మికులు అవకాశాలపై అవగాహన లేకుండా అజ్ఞానంలో జీవితం గడుపుతున్నారని చెప్పారు. విద్య వల్ల కలిగే లాభాలు వారికి తెలియకపోవడం బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వారి పిల్లలను బడికి పంపాలని, విద్యతోనే మెరుగైన జీవితం ఉంటుందని తెలిపారు. విద్యపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని, తమకు దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. మంచి సమాజ నిర్మాణం కావాలనే ఆశయంతో స్లమ్ ఏరియాకు వచ్చి విద్యపై అవగాహన చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ సభ్యులు, జేఎన్టీయూ విద్యార్థులు, వైద్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

దుర్గంధంగా..దుర్గం చెరువు

కొండాపూర్, జూన్ 15 : హైటెక్ సిటీకి మణిహారంగా తీర్చిదిద్దిన దుర్గంచెరువు దుర్గంధ భరితంగా మారింది. మెయింటెనెన్స్ కరువై చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మురుగు నీరు వచ్చి చేరుతుండడంతో వాకింగ్‌ట్రాక్‌పై నడవలేని పరిస్థితి నెలకొన్నది. దుర్వాసనతో నిలువలేక పోతున్నారు. చెరువు దుస్థితిపై తెలంగాణ సీఎంఓ, జీహెచ్ఎంసీ మేయర్, జలమండలి, ఉన్నత అధికారులకు పలువురు ట్విట్టర్ ద్వారా ఫిర్యాదులు చేశారు. కలుషితమైన నీటి వీడియోలను జత చేశారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని చెరువును శుభ్రం చేయడంతో పాటు, చెరువులో కలుస్తున్న మురుగును అరికట్టేందుకు శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటీవలే చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్..

దుర్గం చెరువును నాలుగు రోజుల క్రితమే హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. దుర్వాసన, మురుగు నీరు చెరువులో వచ్చి కలుస్తున్న విషయంపై చర్యలు తీసుకోలేదంటూ వాకర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐటీ కారిడార్‌కు కేర్ ఆఫ్‌గా నిలిచే దుర్గం చెరువు పరిస్థితి ఇలాగే కొనసాగితే, అటువైపు చూసేందుకు జనం జంకుకొనే పరిస్థితిలో వస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హెచ్ఏఎల్ కాలనీ అభివృద్ధికి కృషి

బాలానగర్, జూన్ 15 : హెచ్ఏఎల్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. ఆదివారం హెచ్ఏఎల్ కాలనీలో పాదయాత్ర చేసి కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హెచ్ఏఎల్ పార్కులోని మెయిన్ గేట్ వద్ద ఓపెన్ జిమ్, వ్యాయామ పరికరాలు, చిన్నారుల ఆట వస్తువులు, మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరారు. అన్ని విభాగాల అధికారులతో ఎమ్మెల్యే నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ సమస్యలు ప్రస్తావనకు వచ్చాయని ఆయా సమస్యలు పరిష్కరించే విధంగా ఒత్తిడి తీసుకొని వస్తాన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాంబాబు, ఉప్పల అశోక్, హరిబాబు, ఆర్కే సింగ్, అశోక్ నాయుడు, నరసింహా రెడ్డి, పోచయ్య, మట్టి శ్రీనివాస్, బాలరాజు, మక్కల సత్యనారాయణ, నగేశ్ పాల్గొన్నారు.



కాలనీవాసులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నరసింహ యాదవ్

ఆదరణ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

కేపీహెచ్‌బీ కాలనీ : ఆదరణ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని రాందేవ రావ్ వైద్యశాల మెడికల్ డైరెక్టర్ కమలాకర్, లక్ష్మీ కమలాకర్ అన్నారు. ఆదివారం రాందేవ్ రావ్ వైద్యశాల, ఆదరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్న పిల్లల వైద్య శిబిరాన్ని వైద్యశాల మెడికల్ డైరెక్టర్ కమలాకర్, లక్ష్మీ కమలాకర్, ఆదరణ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ అరిగెల రఘునాథ్‌బాబు ప్రారంభించారు. చిన్నారులకు జనరల్ స్క్రీనింగ్, చెకప్ లాంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించామన్నారు. శిబిరంలో 400 మందికి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ ఎన్. యోబు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఎం. భాను వరకుమార్, మేరీ జోన్స్, అనీషా, సన్నీ ప్రశాంత్, డాక్టర్లు పాల్గొన్నారు.

వైద్యరంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న రాందేవరావ్ వైద్యశాల మెడికల్ డైరెక్టర్ కమలాకర్ రావుకు బిగ్గెస్ట్ డాక్టర్ అవార్డును ప్రదానం చేశారు. హైటెక్ సిటీలో జరిగిన వేడుకల్లో.. 52 ఏండ్లుగా సేవలు అందిస్తున్న డాక్టర్ కమలాకర్ రావు, వైద్యశాల డాక్టర్లు ఛాయాదేవి, రవికుమార్ సుంకర, రాజేశ్ సుంకర, సూర్యకళకు అవార్డులు ప్రదానం చేశారు. వైద్యశాల నిర్వాహకులు మీరా రావు, ప్రశాంత్ రెడ్డి, ధనారావు, వైద్యశాల సీఈవో ఎన్.యోబు అవార్డులు అందుకున్న వారికి అభినందనలు తెలిపారు.

మియాపూర్ :వివాహ వార్షికోత్సవ సందర్భంగా న్యూ జెర్సీలోని గురువాయూరప్ప ఆలయంలో శ్రీకృష్ణుడిని వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు.